# పడమర గాలి

నేవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం లాండింగ్ అయ్యేక, ఇమిగ్రేషన్ స్టాపింగ్, బ్యాంగుల చెకింగ్ ఇతరత్రా పనులు పూర్తిచేసుకుని బయటపడేసరికి సమయం సాయంత్రం నాలుగయ్యింది.

ఎంట్రెన్స్ గేటు దగ్గర భార్గవ ఎదురొచ్చాడు.

వాడిని చూడగానే విమానప్రయాణం బడలిక దూదిపింజలా ఎక్కడికో ఎగిరి పోయింది.

"గుడ్ ఈవెనింగ్ డాడీ" చిరునవ్వుతో అన్నాడు నా చేతిలోని ట్రాలీ హేండిల్‌ను అందుకుంటూ.

"అమెరికాలో చీకటిపడబోతుంటే మన ఇండియాలో ఉషోదయం కాబోతున్నదన్న మాట" అన్నాను నవ్వుతూ.

"దేర్ ఈజ్ నో డార్క్‌నెస్ ఇన్ అమెరికా.... అమెరికా నెవర్ స్లీప్స్ డాడీ" అన్నాడు భార్గవ. కారువైపు లగేజీ వున్న ట్రాలీని నెట్టుకుంటూ వెళుతూ.

"కోడలు, పిల్లలు రాలేదా ఎయిర్‌పోర్టుకు?" అమెరికాలో అడుగుపెట్టగానే మనవదు, మనుమరాలు కన్పించలేదన్న అసంతృప్తి మనస్సులో కదలాడింది.

"మీ కోడలికి సాయంత్రం ఐదుగంటలదాకా ఆఫీసు వుంది. ఆఫీసు నుంచి వస్తూ కేర్‌లో వున్న పిల్లల్ని పికప్‌చేసుకుని ఇంటికొస్తుంది. ప్రయాణం బాగా సాగిందా డాడీ?" అన్నాడు భార్గవ ఆప్యాయంగా.

"బాగానే సాగిందిరా... గంటగంటకూ ఏదోకటి, కూల్ డ్రింక్స్, భోజనమో, కాఫీయో... ఇస్తూనే వున్నారు... విసుగుపుట్టకుండానే సాగింది ప్రయాణం.

".... ఎలా వుందిరా నీ ఉద్యోగం.... ఆర్థికమాంద్యంతో అమెరికా గిలగిలా కొట్టుకుంటూ వుందని అందరూ అనుకుంటున్నారు..." వాడిని అడిగాను.

"అమెరికన్ ఎకానమీ ఈజ్ వూండెడ్.... బట్ అమెరికా స్టీల్ డామినేట్స్ వరల్డ్ ఎకానమీ" చెప్పుకుపోయాడు భార్గవ. పెద్ద బ్యాంకింగ్ వ్యవస్థలున్న లెహమాన్ బ్రదర్స్ దివాళా తీయడం గూర్చి ఎఐజికి అమెరికా ప్రభుత్వం ఋణం ఇచ్చి ఆదుకోవడం, చైనా దగ్గర నుండి ఆర్థిక సాయంకోసం అర్రులుచాచడం, ఔట్‌సోర్సింగ్‌తో అమెరికాకు వచ్చిన ముప్పు- అన్నీ వివరంగా చెప్పాడు.

ప్రిన్స్‌టన్‌లో ఉంది భార్గవ ఇల్లు. ఎయిర్‌పోర్టు నుంచి ఇంటికి చేరుకోవడానికి గంటపట్టింది.

అమెరికా వెళ్లడం అదే మొదటిసారి.

రోడ్లమీద కార్లు తప్పితే మనుషులు కనబడలేదు. చీమల బారులా కన్పించేకార్లు.... రోడ్లుచాలా విశాలంగా చూడముచ్చటగా కన్పించాయి. మనిషి సమూహంలో ఆనందించే నాకు ఎక్కడా మనుషులు రోడ్లమీద కన్పించకపోయేసరికి విచిత్రంగా తోచింది.

"షాపింగ్‌మాల్స్, డౌనటౌన్‌లో మాత్రమే మనుషులు కన్పిస్తారు.... మన దేశంలో జనమంతా రోడ్లమీద ఉమ్మేయడం, రోడ్లపక్కనే నేచురల్ కాల్‌కి వెళ్ళడం.... చీప్ లిక్కర్ తాగి రోడ్లమీదే నృత్యంచేస్తూ ఉంటారు....

మనవాళ్ళకి డిసిప్లిన్ లేదు... ఇక్కడ పోలీసులంటే భయం ఉంది.... చట్టమంటే గౌరవం ఉంది... అన్ని పనులు క్రమపద్ధతిలో నడుస్తాయి... ప్రోగ్రామ్డ్ అండ్ సిస్టమేటిక్ లైఫ్.... అమెరికా ఈజ్ పారడైజ్ ఆన్ ఎర్త్" అమెరికా గొప్పతనం గూర్చి చెప్పుకొచ్చాడు మావాడు.

అమెరికాలో ఉంటున్నాడు కాబట్టి అమెరికాను పొగడొచ్చు.... కానీ ఇండియాను తక్కువచేసి మాట్లాడడమెందుకు? భార్గవ బి.టెక్ పూర్తిచేసి అమెరికా ప్రస్తావన తెచ్చినప్పుడే తను అమెరికా వెళ్ళొద్దని చెప్పాను.

"అమెరికా ఎందుకు? డబ్బులు సంపాదించడానికా? అమ్మ చనిపోయింది. నువ్వు

తప్పితే నాకు తోడు ఎవ్వరూ లేరు.... నాకు దూరంగా జరిగి, ఎక్కడో ఎవరికో సేవలుచేసి తరించడం నాకు నచ్చదు. హైద్రాబాద్‌లో నీకు మంచి ఉద్యోగమే వస్తుంది... దానితో తృప్తిపడక రెక్కలు వచ్చాయని దూరంగా ఎగిరిపోతానంటే ఎలా? నీతోపాటు నేను ఎగరలేను గదా!" నచ్చచెప్పబోయాను.

వాడు అనుకున్నదే చేశాడు. అమెరికా వచ్చి ఎమ్.ఎస్. చేసి న్యూజెర్సీలో ఉద్యోగం సంపాదించాడు.

భార్గవ వసుమతిని చేసుకున్నట్లయితే బాగుండేది.

తమిళ అమ్మాయిని చేసుకున్నాడు. కోడలి పేరు నళిని. ఆ అమ్మాయి కూడా అందంగానే ఉంటుంది. భార్య చనిపోయేక ఆమె ఎడబాటును మర్చిపోవడానికి ఆ ఊరు, ఈ ఊరు తిరుగుతూ ఉండేవాడు తను. పెద్దమద్దాల వెళ్లాడు.

బాల్య మిత్రుడు సాంబయ్య ఇంటికి వెళ్ళేసరికి మనస్సు ఆనందంతో పులకించిపోయింది. పూలతోట మధ్య వాళ్ల ఇల్లు పొదరిల్లులా ఉంది.

కమ్మటి పూల పరిమళం చుట్టుముట్టేసింది. ఇంటి వెనుకవైపు పచ్చటి పొలాలు, ఇంటిముందు ఎగిరిగంతులేస్తున్న లేగదూడ కన్పించింది. ఆ లేగదూడ తన గరుకు నాలికతో చేతులు నాకుతుంటే ఆ బుజ్జాయి మేనంతా నిమరాలనిపించింది. లేగదూడను నిమరబోయేసరికి అది గంతులేస్తూ మరో దిక్కుకు పరుగెత్తింది.

ఎర్రరంగు లంగా,పూల డిజైన్ ఉన్న జాకెట్టు, పసుపుపచ్చ ఓణీ, తలనిండా కనకాంబరాల పూలదండతో మెరుపుతీగలా ఓ అమ్మాయి ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. సాంబయ్య కూతురే ఆ అమ్మాయి.

'భార్గవకు ఈ అమ్మాయి సరిజోడీ' అనుకున్నాను.

ఆ మాటే సాంబయ్యకు కూడా చెప్పాను. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

"అమెరికా సంబంధానికి సరితూగగలనా? నాకు ఉంది ఒక్క ఎకరం పొలం, ఇంట్లో తిండి గింజలకే చాలడంలేదు ఆ ఎకరం మీద వచ్చే ఆదాయం... కట్నం ఇచ్చుకోలేను" అన్నాడు సాంబయ్య.

"బంగారపు బొమ్మని మాకు అప్పగించబోతున్నావ్.... పెళ్లి ఖర్చులు కూడా నేనే పెట్టుకుంటాను" అన్నాను.

నన్ను కౌగలించుకుని అమాంతంపైకి ఎత్తేశాడు సాంబయ్య. వసుమతి ఫోటో అమెరికా పంపాడు. నెల రోజుల్లో తిరుగు జవాబు వచ్చింది కొడుకు దగ్గర్నుంచి, ఆ ఉత్తరంతోపాటు తమిళ అమ్మాయి ఫోటో.

చిన్నప్పటి నుంచి వాడిమాటే నెగ్గుకు వస్తున్నాడు. తన ఇష్టాలు. అభిప్రాయాలు వాడిమీద రుద్దలేదు. వాడికి వచ్చిన గళ్ళషర్టు, జీన్స్‌ప్యాంట్ కొనుక్కునేవాడు.

"బైపిసి తీసుకుని డాక్టరుసీటు సంపాదించరా?" అంటే "బైపిసిలో కాంపిటీషన్ ఎక్కువ ఉంటుంది... సీట్లు తక్కువగా ఉంటాయి. ఎమ్.బి.బి.ఎస్‌లో... మనకు రిజర్వేషన్ కూడా లేదు... బైపిసి వద్దులే" అన్నాడు.

'చదివేది వాడు. వాడిష్టం' అనుకున్నాను.

తమిళఅమ్మాయిని సెలక్ట్‌చేసుకుంటే 'వాడి లైఫ్‌పార్ట్‌నర్‌ని వాడే సెలక్ట్ చేసుకున్నాడు .... ఫ్చ్...ఏదీ మనం అనుకున్నట్లు జరగదు' అనుకుని సమాధానపడ్డాను. కొడుకు మనస్సు తెలుసుకోకుండా సాంబయ్యకి మాటఇచ్చాడు. వసుమతికి ఏవేవో ఆశలు కల్పించాను.

అదే నేను చేసిన పెద్ద పొరపాటు.

పొన్నూరులో తెలిసినవాళ్ళ పెళ్లికి వెళితే అక్కడ సాంబయ్య కన్పించాడు. తన కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. స్నేహితుడిని కౌగలించుకుని వాడి భుజంమీద కన్నీటి చుక్కలు రాల్చాను. వాడే నన్ను ఓదార్చాడు.

సాంబయ్య కూతురికి మంచి సంబంధం చూడాలని పట్టుదల వచ్చింది. మా తమ్ముడి కొడుకు విప్రో కంపెనీలో కంప్యూటర్ ఇంజనీరుగా చేస్తున్నాడు. భార్గవకంటే అందంగా ఉంటాడు. తమ్ముడిని ఒప్పించాను. వసుమతిని చూసి ఎగిరిగంతేశాడు మా తమ్ముడి కొడుకు. పెళ్లి ఖర్చులు నేనే పెట్టుకుని పెళ్లి వైభవంగా జరిపించాను.

డిష్‌వాషర్ మోతతో మనస్సులో ముసురుకున్న పాతస్మృతులు ఒక్కసారిగా చెదిరిపోయాయి.

"మనం అంట్లు తోముకునే పనిలేదు. నాన్నా! ఈ డిష్‌వాషర్‌లో మనం వంటకు వాడిన గిన్నెలు, తిన్న పళ్లాలు ఇందులో పడేస్తే అదే కడిగి, శుభ్రంచేసి నీట్‌గా ఉంచు తుంది...వాషింగ్‌మెషిన్ వుంది... బట్టలుఉతికి అదే అరబెట్టి పొడిపొడిగా మనకు అందిస్తుంది.

కింద బేస్‌మెంట్‌లో ఫ్రీజర్ వుంది. కూరగాయలు, నాన్ వెజిటేరియన్ స్టఫ్, పాలు- అందులో పడేస్తే ఎన్ని నెలలు ఉంచినా చెక్కు చెదరవు. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి... ఇంట్లో మనం పెద్దగా కష్టపడాల్సిన అవసరంలేదు" అన్నాడు భార్గవ. ఇంట్లో వస్తువులన్నీ ఒక్కొక్కటిగా నాకు చూపించాడు. కాఫీ కలిపిఇచ్చాడు.

'మనస్సులో చిన్న అనుమానమొచ్చింది....'

'అమెరికాలోనే ఉండిపోతాడేమో!'

అప్పుడే కోడలు, పిల్లలు వచ్చారు.

"యువర్ గ్రాండ్‌పా.... హగ్ హిమ్" అని భార్గవ అనగానే పిల్లలు వచ్చి నా ఒళ్ళో దూరారు.

పిల్లలతో ముద్దుముచ్చటా మూడుక్షణాలే!

వాళ్లకు తెలుగురాదు. అమెరికన్ యాసతో గూడిన వాళ్ల ఇంగ్లీషు నాకు అర్థంకాలేదు. ఇంగ్లీషు తనకు బాగానే వచ్చు. ఆర్.కె.నారాయణ, అరుంధతీరాయ్, రాజారావు ఇంగ్లీషు రచనలంటే ఇష్టపడేవాడు.

అమెరికన్ కవి రాబర్ట్ ఫ్రాస్ట్ కవితలంటే ఇష్టం. జాన్ స్టీయిన్‌బెక్ రచనలంటే ఎంతో ఇష్టం. 'గ్రేప్స్ ఆఫ్ వ్రాత్' నవల ఎన్నిసార్లు చదివాడో! టెక్సాస్ నుంచి కాలిఫోర్నియాకు బతుకుతెరువుకోసం యాత్ర సాగించిన నల్లజాతివాళ్ళ బతుకు చిత్రం ఆ నవల. పరభాషా జ్ఞానాన్ని సంపాదించినా మాతృభాషని మర్చిపోతే ఎలా?

సచివాలయంలో అధికారిగా కూడా పనిచేశాడు తను. అయినా పిల్లలతో ఇంగ్లీషులో మాట్లాడలేకపోయాడు అలవాటులేక. వాళ్ళకు పోతన పద్యాలు, అన్నమయ్య కీర్తనలు నేర్పుదామనుకున్నాడు. ఒక్క ముక్క తెలుగు రానివాళ్లకు తెలుగుపద్యాలు ఏం నేర్పుతాడు?

"అమెరికాలో కరెంటువైరు ముట్టుకున్నా షాక్ కొట్టదు డాడీ" అన్నాడు భార్గవ మురిసిపోతూ

పిల్లలతో ఆహ్లాదంగా మాట్లాడలేని స్థితి తలచుకుని 'షాక్' తగిలినట్లు అన్పించింది నాకు

"కోడలు పిల్లలకు తమిళభాష నేర్పవచ్చు. నువ్వు తెలుగులో పిల్లలతో మాట్లాడొచ్చు

గదా! ప్రతి పక్షికీ సొంత గొంతు ఉంటుంది. గుర్రం సకిలిస్తుంది.... గాడిద ఓండ్ర పెడుతుంది. పిల్లి 'మ్యావ్ మ్యావ్' అంటుంది... జంతువులన్నిటికీ సొంత అరుపులు ఉన్నాయి. మనిషికొక్కడా సొంత భాషలున్నాయి... దేవుడు ఇచ్చిన సొంత గొంతును కూడా మర్చిపోయి అరువు గొంతుతో మాట్లాడితే ఎలా? అమృతమైన మాతృభాషని మృతభాష చేస్తే ఎలా?" మా వాడిని ప్రశ్నించాను.

పార్కులో ఓ మూల కూర్చుని పూసలదండలు అమ్ముతున్న ఓ నేటివ్ ఇండియన్‌ను చూపించాడు భార్గవ.

"ఒకప్పుడు అమెరికా గడ్డమీద స్వేచ్ఛగా తిరిగారు బ్రిటిష్‌వాళ్లు, పోర్చుగల్, స్పెయిన్‌వాళ్ళు.

వారి భూభాగాన్ని ఆక్రమించి నేటివ్ ఇండియన్స్‌ను మారుమూల ప్రాంతాలకు తరిమివేశారు. ఎదురుతిరిగినవాళ్ళను పిట్టల్లా కాల్చిచంపారు. కొన్ని రిజర్వ్‌డ్ ఏరియాలని గుర్తించి వాళ్ళకు అక్కడే స్థావరం ఏర్పరిచారు.

ఇంగ్లీషు నేర్చుకొమ్మని వాళ్ళపై ఒత్తిడి తెస్తున్నారు.... వాళ్ళ సంస్కృతి, భాష, వేషం మార్చుకుని ప్రధాన జీవనస్రవంతిలో కలసిపొమ్మని ఒత్తిడి తెస్తున్నారు....

మేం కూడా మన దీపావళి, దసరా మర్చిపోయి రూలోలిన్, ఫాదర్స్‌డే, మదర్స్‌డే.... 'థ్యాంక్స్ గివింగ్ డే' సెలబ్రేట్ చేసుకుంటున్నాం.... మాతృభాషను మర్చిపోయే ప్రయత్నం చేస్తున్నాను" అన్నాడు భార్గవ.

వాడు చెప్పేది నిజమేననిపించింది.

న్యూజెర్సీకి ఆనుకుని వుంటుంది న్యూయార్క్. ఆదివారంనాడు న్యూయార్క్ తీసుకువెళ్ళాడు. అక్కడ అతి పెద్ద ఎత్తైన భవనం ఎంపైర్ స్టేట్‌బిల్డింగ్, చైనా టౌన్, టైమ్స్ స్క్వేర్, వాల్‌స్ట్రీట్, టెర్రరిస్టు దాడులకు గురై కూల్చివేయబడ్డ వరల్డ్ ట్రేడ్ సెంటర్ సైట్ చూపించాడు.

మరో ఆదివారం వాషింగ్‌టన్ డి.సి.కి తీసుకెళ్ళాడు. వార్ మెమోరియల్స్ చూస్తుంటే నెత్తుటి మరకలు కన్పించాయి. అవకాశం దొరికినప్పుడల్లా అమెరికా గొప్పదనం గూర్చి ఊదరగొట్టేస్తున్నాడు మావాడు.

చిన్నప్పుడు వాడు పిల్లలందరినీ గ్రంథాలయం దగ్గర చేర్చి మువ్వన్నెల జండా

ఎగరెయ్యడం, చొక్కా గుండెకి చిన్ని నేషనల్ ఫ్లాగ్ తగిలించుకుని గంతులెయ్యడం గుర్తుకు వచ్చింది. నిద్రపోయేటప్పుడు వాళ్ళమ్మ చొక్కాకు ఉన్న ఫ్లాగ్ తియ్యబోయే వాళ్ళమ్మ చేతులు నెట్టివెయ్యడం ఇప్పటికీ నా కళ్ళలో మెదులుతూనే ఉంది ఆ దృశ్యం. చిన్నప్పుడు నడకను, నడతనూ నేర్పిన అమ్మను ఒక్కసారి కూడా తలవడే!

'అమ్మ బతికి వుండి నీతోపాటే అమెరికా వొస్తే ఎంత సంతోషించేవాడినో! అమ్మకి నీ కళ్ళతో అమెరికాను చూపిస్తా నాన్నా!' అని ఒక్క మాట అంటే ఎంత బాగుణ్ణు! లావుగా వున్న కొడుకును చూసి మురిసిపోతూ నా బుజ్జి వినాయకుడు అనుకునేది. ఇంటిగోడల మీద అత్తగారి, మామగారి ఫోటోలు ఉన్నాయిగాని అమ్మ ఫోటో పెట్టుకోలేదెందుకు? అమ్మని మర్చిపోయాడా?

....చిన్నప్పుడు పక్క తడిపే అలవాటు ఉండేది వాడికి. చీర తడిసినా చిరాకుపడేది కాదు... పదో తరగతికి వచ్చేవరకూ అమ్మ పక్కలోనే దూరేవాడు.... వాడికి జ్వరం తగిలితే కన్నీళ్లు పెట్టుకునేది. పగలు, రాత్రి మంచం పక్కనే కూర్చుని తడిగుడ్డతో ఒళ్ళు తుడుస్తూ మందులు వేస్తూ- పాలో- జావో తాగిస్తూ వుండేది.

సైకిల్‌మీద నుంచి కిందపడి కాలికి దెబ్బతగిలినప్పుడు తన కాలు విరిగినంత బాధపడింది పార్వతి. భార్గవకు ఇంజినీరింగ్‌లో సీటు వచ్చినప్పుడు "చదువు డబ్బు ఎలా సర్దాలా?" అని మథనపడుతుంటే తనకు చెప్పకుండానే నగలు అమ్మేసి డబ్బుతెచ్చి తన చేతిలో పెట్టింది.

భార్గవ ఇంజినీరింగ్ పూర్తిచేసుకుని ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. అప్పుడే వాళ్ళమ్మ క్యాన్సర్ వచ్చి చనిపోయింది. ముందు 'బ్రెస్ట్‌క్యాన్సర్' అన్నారు. రెండు స్తనాలు తొలగించారు. తన ముందు నిలబడినప్పుడు సిగ్గుపడేది. చీరకొంగు భుజం చుట్టూ కప్పుకునేది. నా కంటి వెలుగువు నువ్వు... నువ్వు కనిపిస్తే చాలు అంటూ ఆమె చెక్కిలిని ముద్దుపెట్టుకునేవాణ్ణి.

ఆ తరువాత మెదడుకు వొచ్చింది క్యాన్సర్. రెండు నెలలు తిరక్కముందే కనుమరుగయ్యింది.

అమెరికాలో తిరుగుతున్న ప్రతిపక్షణం మదిలో మెదులుతూనే వుంటుంది పార్వతి. అ, ఆ, ఇ,ఈలు నేర్పి ఆకృతినిచ్చిన అమ్మను భార్గవ ఎలా మర్చిపోయాడు?

పెళ్లయిన కొత్తలో పార్వతిచేసిన అల్లరి, భార్గవ పెంపకంలో మేం పొందిన

ఆనందం, వాడికి తెలిసి ఎన్నో విషయాలు భార్గవతో పంచుకోవాలనుకున్నాను. అమ్మ ప్రస్తావన రాగానే వాడిలో ఏదో డిప్రెషన్ మొదలవుతుంది.

ఇంటి దగ్గరే పార్టీ ఏర్పాటుచేశాడు భార్గవ. ఇంటి వెనుక విశాలమైన పచ్చటి లాన్ ఉంది. అక్కడే టెంట్‌వేసి లైట్లు ఎరేంజ్ చేశాడు. భార్గవ పనిచేసేది ఓ పెద్ద ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో. పార్టీకి వాళ్ళ బాస్ కూడా వొస్తూ ఉండడంతో హడావిడి ఎక్కువైంది. పెద్ద పెద్ద ఉద్యోగాల్లో ఉన్న ఓ యాభైమంది పార్టీకి వచ్చారు.

పిల్లలంతా స్వింగ్ దగ్గర ఆడుకుంటూ ఉన్నారు. మరికొందరు పిల్లలు చెట్లకింద చేరి గంతులేస్తున్నారు. అది జూన్ నెల,రాత్రి పదిగంటలకుగాని చీకటి పడదు. చలికాలమైతే సాయంత్రం నాలుగ్గంటలకే చీకటిపడుతుంది. చలికాలం బైట వెన్నెల రాత్రుల్లో తిరగలేరు, వేసవికాలం బాగా వెన్నెల వచ్చేటప్పటికి నిద్రావస్థకు చేరుకుంటారు. వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు అమెరికాలో కన్పించరు. టేబిల్‌మీద బ్లాక్‌డాగ్ విస్కీ రష్యన్ ఓడ్కా కోక్‌బాటిల్స్ అమర్చారు. క్రిస్టల్ టంబ్లర్‌లో కొద్దిగా విస్కీ పోసి భార్గవ వాళ్ళ బాస్‌కి అందించాడు. బాస్ ఆ గ్లాసు భార్గవ భార్యకిచ్చేడు. నళిని నవ్వుతూ సిప్‌చేసింది.

కోడలి భుజంమీద భార్గవ వాళ్ళ బాస్ చెయ్యివేయడం, నళిని విస్కీ తాగడం ఎందుకో నచ్చలేదు తనకు.

"వెన్ యు ఆర్ ఇన్ రోమ్, బిఎ రోమన్" చిన్నప్పుడు చదువుకున్న వాక్యం గుర్తుకు వచ్చింది. అమెరికాలో ఉన్నప్పుడు అమెరికన్‌లా ఆలోచించాలి. తెలుగువాడి పాతచింతకాయ పచ్చడి వడ్డిస్తానంటే ఎలా?

"ఇక్కడ బాస్, చిన్న ఉద్యోగి అన్న భేదాలు ఉండవ్... ఆఫీసులోనైనా, బయట అయినా స్నేహితుల్లా ప్రవర్తిస్తారు.... ఒకరినొకరు గౌరవించుకుంటారు.... ఆడవాళ్ళకు పెద్దపీట వేస్తారు" నా దగ్గరకొచ్చి అన్నాడు భార్గవ.

"మీరు పాటలు బాగా పాడతారటగా.... ఓ పాట పాడండి" అన్నాడు బాస్, నళినీతో.

బిడియం లేకుండా ఓ ఇంగ్లీష్ పాట పాడింది నళిని. అందరూ మెచ్చుకున్నారు. "నెల్ వయోలిన్ చాలా బాగా వాయిస్తుంది" అన్నాడు భార్గవ వాళ్ల బాస్‌తో.

బాస్ దృష్టి నళిని మీద నుంచి నెల్‌మీదపడింది.

నెల్ కొత్తగా ఉద్యోగంలో చేరింది. దేవకన్యలా మెరిసిపోతూ ఉంది. ఆ అమ్మాయి తన ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లోనే పనిచేస్తున్నదని తెలుసుకుని బాస్ సంబరపడ్డాడు. ఆ అమ్మాయి దగ్గర నిలబడి వయొలిన్ వాయించమని ప్రోత్సహించాడు. భార్గవ వయొలిన్ తెచ్చి ఆ అమ్మాకి ఇస్తే బిడియపడుతూ వాయించింది.

విస్కీగ్లాసు నెల్‌కు అందించబోయాడు బాస్.

సున్నితంగా తిరస్కరించింది నెల్. "ఐ డోంట్ డ్రింక్" అంది నెల్. అమెరికా అమ్మాయి తాగే అలవాటు లేదనడం, నళిని విస్కీ తాగడం నాకు వింతగా తోచింది.

రకరకాల వంటకాలు సువాసనలు వెదజల్లుతూ, నోరు ఊరిస్తూ టేబిల్‌మీదకు చేరుకున్నాయి. టర్కీ బ్రెస్ట్, పోర్క్ చాప్స్, ఫ్రైడ్ చికెన్, కైజర్ రోల్స్, ష్రింప్, క్రాబ్‌మీట్–ఓ గంట గడిచేసరికి వంటకాలన్నీ ఖాళీ అయ్యాయి.

"అయామ్ వెరీమచ్ ప్లీజ్‌డ్ విత్ యువర్ పార్టీ..... యు టెల్ టు నెల్ టు కమ్ టు మై హోమ్ టుమారో.... ఐయామ్ ఎలోన్.... ఐ వాంట్ టు హియర్ హర్ మ్యూజిక్" అన్నాడు బాస్, భార్గవతో వెళ్లిపోయేముందు.

నెల్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి వెళ్ళిపోయాడు బాస్.

మూడునెలల అమెరికా యాత్ర ముగింపుకు వచ్చింది. తిరుగు ప్రయాణ మయ్యాను. చెకిన్ అయ్యేవరకూ భార్గవ నా పక్కనే ఉన్నాడు. బోర్డింగ్ పాస్ తీసుకుని ఇచ్చాడు.

వాడి కళ్లల్లో దిగులు కన్పించింది. "నువ్వు సంతోషంగా ఉన్నావా ఇక్కడ?" ప్రశ్నించాను. మనస్సులో చెలరేగుతున్న తుఫాను తీరందాటినట్లుగా వాడి నోట్లో నుంచి మాటలు ఊడిపడ్డాయి. "అయామ్ నాట్ హేపీ డాడీ" అన్నాడు భార్గవ నా భుజంమీద వాలిపోయి. కళ్లు తుడుచుకుని మనస్సులోని బాధను వెళ్లగక్కాడు.

"ఈ అమెరికా సమాజం కోళ్ళఫారంలా కన్పిస్తూంది. టైమ్‌ప్రకారం డాలరు గుడ్లు పెడతాయి. మెకానికల్‌గా సాగిపోతూ ఉంటుంది జీవితం. బతుకులో జీవంలేదు, గుడ్లు మురిగిపోతున్నాయి. ఆర్థికమాంద్యం అమెరికాను కకావికలంచేస్తూ వుంది. అంతా సఫకేషన్, ఊపిరి ఆడని పరిస్థితి బర్డ్‌ఫ్లూ వచ్చినట్లు.... స్టిల్ ఐ లవ్ దిస్ కంట్రీ. ఆర్థిక ఇబ్బందులకు అధిగమిస్తుందని నమ్మకం."

"ఇండియాకు తిరిగి వెళ్లిపోవాలనే ఎప్పుడూ అన్పిస్తుంది. ఇక్కడ ఉన్న సౌకర్యాలు

అక్కడ వుండవు. ఇండియాకు వచ్చి రోడ్లు, కిక్కిరిసిన బజార్లు చూడగానే బేజారు వస్తుంది. అక్కడి డస్ట్‌కు ఎలర్జీ వస్తుందని నళిని అంటుంది. పిల్లలకు ఇండియాలోని టాయిలెట్స్ నచ్చవ్. తడితడిగా ఉంటాయని అంటారు.

ఇక్కడే ఉండిపోదామన్నా దిగులే! ఇక్కడి పాశ్చాత్య నాగరికతా ప్రభావంలో కొట్టుకుపోతారేమోనని. ఇక్కడ ఇమడలేం. ఇండియాకు రాలేము. త్రిశంకుస్వర్గంలో ఉన్నట్లుంది పరిస్థితి" అన్నాడు భార్గవ.

నాకేదో అనుమానం వచ్చింది. వాడిని అడగకుండా ఉండలేకపోయాను. "నీ ఉద్యోగం ఉందా? ఊడిపోయిందా?" భార్గవను అడిగాను.

"నన్ను ఉద్యోగంలో నుంచి తీసేశారు. నెల్‌ని, వయొలిన్ వాయించడానికి బాస్ ఇంటికి పంపుతానని ప్రామిస్ చేశాను. నాకింది అధికారి అయిన నెల్ నా మాట లెక్కచేయలేదు. బాస్ ఇంటికెళ్లడం ఆమెకిష్టంలేదు.

సబార్డినేట్స్‌ను కంట్రోల్ చెయ్యలేనందుకు నన్ను, బాస్ పట్ల అవిధేయత చూపించినందుకు నెల్‌ను ఉద్యోగం నుంచి తీసేశారు. అయామ్ నాట్ వర్రీయంగ్ ఎబౌట్ జాబ్..... ఇక్కడ ఉద్యోగం పోవడం, దొరకడం మామూలే!

బాస్ వాదన బాసుది. నెల్‌ని మర్యాదగా ఇంటికి పిలిచానేగాని, ఎటువంటి దురుద్దేశం లేదంటాడు. బాస్‌పట్ల అపనమ్మకం కిందివాళ్ళకు ఉండకూడదంటాడు..."

భార్గవను అభద్రతాభావం వెన్నాడుతూ వుందని నాకు అర్థం అయింది. పడమర గాలి నన్ను ఇబ్బంది పెట్టినట్లు అన్పించింది. భార్గవ భుజం తట్టి, పిల్లల బుగ్గలు మరోసారి నిమిరి సెక్యూరిటీ చెక్‌వైపు నడిచాను.

వాళ్లు అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

- స్వాతి సపరివారపత్రిక, 17 జూన్ 2011